సాక్షి
ప్రకాశం
సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023





**ప్రశాంతంగా ఎస్సై పరీక్షలు**
ఎస్సై ఉద్యోగాల కోసం రాతపరీక్షలు ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. 6,998 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. - 8లో..



**సంతోషాలు మింగిన మృత్యువు**
మేదరమెట్ల జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31 /20

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రివేళ చల్లని గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### భైరవకోనకు మహా శివరాత్రి ఆదాయం రూ.2.98 లక్షలు



భైరవకోనలో శివరాత్రి ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

**సీఎస్‌పురం:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన ఆలయానికి రూ.2,98,585 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ సీహెచ్ సుబ్బారావు, అసిస్టెంట్ కమిషనర్ సిబ్బంది దుర్గా ప్రసాద్, శ్రీనివాసరావు, నిహారిక ఆధ్వర్యంలో ఆదివారం భైరవకోనలో శివరాత్రి ఆదాయాన్ని లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,61,112, టికెట్ల అమ్మకం ద్వారా రూ.1,37,473 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం



ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

**ఒంగోలు టౌన్:** మహావీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందని ఆరె మరాఠ, ఆరె క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాశే వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నగరంలోని మరాఠిపాలెంలో ఛత్రపతి శివాజీ 394వ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఛత్రపతి జీవిత చరిత్రను తెలియజేయాలని కోరారు. వీరుల జీవితాలను చదువుకుంటూ పెరిగే విద్యార్థులకు దేశం పట్ల, కుటుంబం పట్ల, సమాజం పట్ల బాధ్యతగా మెలుగుతారని చెప్పారు. తొలుత శివాజీ విగ్రహం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం వీధుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కర్నూలు రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ అద్దంకి బస్టాండు, కొత్తపట్నం బస్టాండు సెంటర్, రైల్వేస్టేషన్, కలెక్టర్ బంగ్లా, మిరియాలపాలెం మీదుగా మరాఠిపాలెం వరకు నిర్వహించిన ర్యాలీలో ఛత్రపతి శివాజీ అభిమానులు, మరాఠీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో సంఘం నాయకులు దైండే ప్రభాకర్‌రావు, సోమాశి శివ ప్రసాద్, కె.సుబ్బారావు, తిరుమలరావు, సత్యనారాయణ, యం.కొండలరావు తదితరులు హాజరయ్యారు.

### అన్నవరంలో పొట్టేళ్ల పోటీలు

**పొదిలి రూరల్:** మహాశివరాత్రి పండుగ సందర్భంగా పొదిలి మండలంలోని అన్నవరంలో ఆదివారం పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు మొత్తం 36 పొట్టేళ్లు పోటీలకు వచ్చాయి. ఈ పోటీలను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ఆసక్తితో వేలాది జనం తరలివచ్చారు. నాగబొట్లపాలెం పొట్టేలుకు మొదటి బహుమతి రూ.20 వేలు, తుమ్మసముద్రం పొట్టేలుకు ద్వితీయ బహుమతి రూ.15 వేలు, రాజంపల్లి పొట్టేలుకు తృతీయ బహుమతి రూ.10 వేలు, ఎనికపాడు పొట్టేలుకు నాల్గువ బహుమతి రూ.5 వేలు నిర్వాహకులు అందజేశారు.



ఢీకొంటున్న పొట్టేళ్లు

# తీరనున్న దాహార్తి

జిల్లా ప్రజలకు శాశ్వతంగా సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం 2 విడతల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచి నీరు అందించే లక్ష్యంతో అధికారులు పనులు చేస్తున్నారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధమై అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



మార్కాపురంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్

- జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ శుద్ధ జలం
- జలజీవన్ మిషన్ ద్వారా రెండు దశల్లో ఏర్పాటు
- మొదటి దశలో 1420 పనులకు రూ.242.32 కోట్లు
- రెండో దశలో 1040 పనులకు రూ.420.74 కోట్లు
- జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 4,98,290 గృహాలకు నీటి సరఫరా

**మార్కాపురం:** జిల్లాలో మొత్తం 8 నియోజకవర్గాలు ఉన్నాయి. జలజీవన్ మిషన్ ద్వారా రెండు దశల్లో ఇంటింటికీ మంచి నీరు అందించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సన్నద్ధమయ్యారు. జిల్లాలో మొత్తం 4,98,290 గృహాలకు జలజీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా చేయనున్నారు. ఇప్పటికే 3,17,002 గృహాలకు కుళాయిలు బిగించారు. కొత్తగా 1,81,288 మందికి నీటి కనెక్షన్లు ఇవ్వనున్నారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, సంతనూతలపాడు, దర్శి, కనిగిరి, కొండపి, ఒంగోలు నియోజకవర్గాల్లో మొదటి దశలో మొత్తం 1428 పనులు మంజూరు చేసి రూ.242.32 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో దర్శిలో 79, గిద్దలూరులో 243, కనిగిరిలో 412, కొండపిలో 212, మార్కాపురంలో 162, ఒంగోలులో 55, సంతనూతలపాడులో 77, యర్రగొండపాలెంలో 108 వర్కులు మంజూరు చేయగా వీటిలో 1255 పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. దర్శిలో 76, గిద్దలూరులో 206, కనిగిరిలో 392, కొండపిలో 187, మార్కాపురంలో 129, ఒంగోలులో 41, ఎస్ఎన్‌పాడులో 49, వైపాలెంలో 175 పనులు ఉన్నాయి. రూ.173.47 కోట్లు ఈ పనులకు ఖర్చు పెడుతున్నారు.

**రెండో దశలో..**
జిల్లాలో రెండో దశలో 1041 పనులకుగాను రూ.420.74 కోట్లు కేటాయించారు. సంతనూతలపాడులో 62, ఒంగోలులో 17, కొండపిలో 67, దర్శిలో 181, గిద్దలూరులో 251, కనిగిరిలో 210, పొదిలిలో 130, వైపాలెంలో 123 ఉన్నాయి. 2024కు జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచి నీరు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.





మార్కాపురంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

**పశ్చిమ ప్రకాశంలో ఇలా..**
పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో 21 మండలాల్లో 1067 నివాస ప్రాంతాల్లో 10.22 లక్షల మందికి ప్రజలకు వాటర్ గ్రిడ్ కింద జలజీవన్ మిషన్ నిధులతో గొట్టిపడియ దగ్గర నిర్మిస్తున్న ఇన్‌టెక్ వెల్ పంప్ హౌస్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఇచ్చి నీరు సరఫరా చేయనున్నారు. దర్శి ప్రాంతంలో సాగర్ నీటిని అందించనున్నారు. మిగిలిన ప్రాంతాల్లో నీటి లభ్యతను బట్టి డీప్ బోర్లు వేసి, ట్యాంక్‌లు కట్టి ఇంటింటికీ సురక్షిత నీటిని అందించనున్నారు. మొదటి దశ పనులు యుద్ధప్రాతిపదికపై జరుగుతున్నాయి.

**నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పనులు**



మార్కాపురం నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ కింద 162 పనులు మంజూరయ్యాయి. ఇందు కోసం రూ.56.92 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి నియోజకవర్గాల్లో దాదాపు 51 పనులు పూర్తి కాగా 52 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. త్వరగా పూర్తి చేసి ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం.
– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే

**అందరికీ సురక్షిత నీరు అందిస్తాం**



జిల్లా ప్రజలకు జలజీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన మంచి నీటిని అందించాలని నిర్ణయించారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పనులు సాగుతున్నాయి. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని 541 హాబిటేషన్‌లలో ట్రాన్స్‌పోర్టుల ద్వారా నీటి సరఫరా చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపాం. దర్శి, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల్లో వివిధ గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తాం. ప్రజలకు నీటి సమస్య రాకుండా చూస్తున్నాం. పనులకు టెండర్లు కూడా పిలిచాం.
– మర్దన్ అలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఒంగోలు

### అంగరంగ వైభవంగా ఆదిదంపతుల కల్యాణం

త్రిపురాంతకం పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం

**త్రిపురాంతకం:** పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. త్రిపురాంతకం త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదిదంపతుల కల్యాణానికి భారీగా భక్తులు హాజరయ్యారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు హరహర శంభోశంకర అంటూ నినదించారు. భక్తి శ్రద్ధలతో కల్యాణం చూసేందుకు భక్తులు తెల్లవారు జాము వరకు జాగారం చేశారు. స్వామి అమ్మవార్ల ఉత్సవాన్ని వైభవంగా జరిపించారు. అర్చకులు విశ్వనారాయణశాస్త్రి, ప్రసాదశర్మలు కల్యాణం జరిపించారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు కళ్యాణ మహోత్సవానికి పెద్దలుగా వ్యవహరించారు. పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. అనంతరం లింగోద్భవ దర్శనంలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

# విద్యా వ్యవస్థలో సమూల మార్పులు



తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి

- ప్రభుత్వ పాఠశాలలను విద్యా దేవాలయాలుగా చేస్తున్న సీఎం వైఎస్ జగన్
- సమస్యలను సామరస్యంగా తీసుకెళితే ముఖ్యమంత్రి అనుకూలంగా స్పందిస్తారు
- తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఆత్మీయ సమ్మేళనంలో ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి

**ఒంగోలు సబర్బన్:** దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో ఇలాంటి మార్పులు ఏ ముఖ్యమంత్రి కూడా తీసుకురాలేదన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి, అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ విద్యా శాఖ విషయంలో సీఎం వైఎస్ జగన్ ఎంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారని అన్నారు. పేద పిల్లలకు విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలను విద్యా దేవాలయాలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు. ప్రభుత్వానికి–ఉపాధ్యాయులకు మధ్య కొంత గ్యాప్ ఉన్న మాట వాస్తవమన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఇప్పటి వరకు గెలిపించుకుంటూ వస్తున్నారని, ఇప్పుడు ప్రభుత్వమే పార్టీ తరఫున అభ్యర్థులను పెడుతుందంటే ఇక ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తుందనేది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. సమస్యలను సామరస్యంగా సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళితే అనుకూలంగా స్పందిస్తారన్న భరోసాను బాలినేని ఉపాధ్యాయులకు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్ర శేఖర రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంతో సేవాభావం కలిగిన వ్యక్తి పర్వతరెడ్డి అని బాలినేని కితాబిచ్చారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకొని రావాలని సీఎం వైఎస్ జగన్ ఆ బాధ్యతను తనమీద పెట్టారని బాలినేని వివరించారు.

తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఉపాధ్యాయులు సంతోషపడితే విద్యార్థులకు మంచి విద్యను అందిస్తారన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఇంతటి మార్పు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ప్రతి పేద పిల్లవాడికీ చక్కటి చదువు అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్ విజన్ అన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎన్నో పదోన్నతులు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. 1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఉద్యోగాలు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. వారి కుటుంబాల్లో ఎంతో ఆనందం నెలకొందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు–నేడు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టి పేద, మధ్యతరగతి వారికి మంచి విద్యను అందిస్తున్న ప్రభుత్వానికి మద్దతు తెలపాలన్నారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు కేశవరపు జాలిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ అభ్యర్థికి 36 అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గిరి ప్రసాద రెడ్డి, నాయకులు పులి శ్రీనివాసులు, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సంఘం నేత ప్రభాకర రెడ్డి, హెచ్‌టీఎఫ్ పీఎం ఖాన్, పీడీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, కేజీబీవీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి, ఎస్ఎల్‌టీఏ శివ కుమారి, వైఎస్సార్ టీఎఫ్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, వెంకట్రామి రెడ్డితో పాటు అనేక సంఘాల నేతలు ప్రసంగించారు.

**బాలినేనిని సన్మానించిన 1998 డీఎస్సీ అభ్యర్థులు:**
ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని 1998 డీఎస్సీ అభ్యర్థులు సన్మానించారు. ఈ సందర్భంగా 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వీరయ్య, మండవ సుబ్బారావు మాట్లాడుతూ 24 సంవత్సరాలుగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తూ ఉన్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మమ్మల్ని ఆదుకున్నారన్నారు. త్వరలో పూర్తి స్థాయిలో అన్ని నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బాలినేని శ్రీనివాస రెడ్డి కి తాము సమస్యను విన్నవించినప్పుడు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి ఆదుకున్నారన్నారు.

# హరోం హర..

- కన్నుల పండువగా నిర్మమహేశ్వరుని రథోత్సవం
- పొదిలి వీధుల్లో ఊరేగిన గౌరీశంకరుడు
- కులమతాలకు అతీతంగా తరలివచ్చిన ప్రజలు

**పొదిలి రూరల్:** హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ పొదిలి మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొదిలి పట్టణంలో వేంచేసిన పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగా వైభవంగా, రమణీయంగా జరిగింది. వేలాది మంది భక్తులు వెంటరాగా స్వామి వారి ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి పొదిలి పురవీధుల్లో ఊరేగించాడు. స్వామి వారికి మూలంరాజు సుబ్బనరసయ్య, దరిశి వెంకట సుధాకర్, దరిశి వెంకట రామమూర్తిలు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణం శ్రీనివాసాచార్యులు ప్రత్యేకంగా రథాన్ని అలంకరించారు. స్వామివారికి నీటితో వారు పోసి కుంభం పెట్టి పార్వేట బలి ఇవ్వడానికి సుమారు మధ్యాహ్నం 3 గంటలైంది. వేలాది మంది భక్తులు హరహర అంటూ శివనామస్మరణ చేస్తుండగా రథం కదిలింది.

**రథోత్సవానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు:**
ఈ రథోత్సవాన్ని తిలకించడానికి పొదిలి పరిసర గ్రామాల నుంచే గాక, జిల్లా నలుమూలలు నుంచి కులమతాలకు అతీతంగా భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో పొదిలి పట్టణ వీధులన్నీ భక్త జన సంద్రంగా మారాయి. రథం తిరిగే సమయంలో వేలాది మంది మహిళలు వీధుల్లోకి వచ్చి రథం చక్రాల కింద గుమ్మడి కాయలు పెట్టి స్వామివారిని దర్శించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం శివాలయం నుంచి చినబస్టాండ్, అమ్మవారిశాల, పెద్దబస్టాండ్, రాఘవేంద్ర థియేటర్ సెంటరు, సాయిబాబాగుడి సెంటరు, దర్శి రోడ్డు సెంటరు మీదుగా శివాలయం చేరుకుంది. ఎండను సైతం లెక్క చేయకుండా రథోత్సవాన్ని భక్తులు తిలకించారు. రాఘవేంద్ర థియేటర్ సెంటరు నుంచి రథాన్ని మహిళలు లాగారు.

**రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు:**
రథోత్సవం సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులను బాజాభజంత్రీలతో తీసుకురాగా ఆలయ పాలకమండలి సభ్యులు ఘనస్వాగతం పలికారు. వారిని శాలువతో సన్మానించారు. ముందుగా శివాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రథోత్సవంలో పాల్గొని రథం లాగారు. రథోత్సవంలో జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, ఆలయ చైర్మన్ యక్కలి శేషగిరిరావు, తహశీల్దార్ డీ భాగ్యలక్ష్మి, ఈఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మర్రిపూడి, కొనకనమిట్ల ఎంపీపీలు వాకా వెంకటరెడ్డి, మోరబోయిన మురళి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు సూర్జహాన్‌బేగం, డీ శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ కన్వీనర్లు జీ శ్రీనివాసులు, గుజ్జుల సంజీవరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కే నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవానికి హాజరైన అశేష భక్తజన సందోహం, (ఇన్‌సెట్‌లో) రథంపై ఉంచిన ఉత్సవ మూర్తులు



పోటీ పడి రథాన్ని లాగుతున్న మహిళలు



రథోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

## క్లుప్తంగా

### ఉమామహేశ్వరపురంలో భారీ చోరీ

ముండ్లమూరు: తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి సుమారు రూ.10 లక్షల విలువైన ఆభరణాలు చోరీ చేశారు. ఈ సంఘటన ముండ్లమూరు మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామంలో ఆదివారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అమరా వెంకటేశ్వర్లు(చిన్నన్న) వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 12న హైదరాబాద్‌లోని తన కుమారుడి వద్దకు వెళ్లారు. వైద్య పరీక్షలు చేయించుకున్న ఆయన మరో హాస్పిటల్లో పరీక్షలు చేయించుకునేందుకు కుమారుడి వద్దే ఉన్నారు. ఇదిలా ఉండగా ఇంటి పక్కన వారు ఆదివారం ఉదయాన్నే లేచి చూడగా తలుపులు పగలకొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు భావించారు. వెంటనే అమరా వెంకటేశ్వర్లుకు సమాచారం తెలియజేశారు. వెంకటేశ్వర్లు హుటాహుటిన హైదరాబాద్ నుంచి ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో దాచిన వెండి, బంగారు ఆభరణాలతోపాటు రూ.30 వేల నగదు అపహరించారని బాధితుడు చెప్పారు.

### ఎర్రచందనం పట్టివేత?

బేస్తవారిపేట: మండలంలోని పందిళ్లపల్లె టోల్ ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మినీ వాహనంలో చెరకు గెడల లోడులో సుమారు 24 ఎర్రచందనం దుంగలను ఉంచి అక్రమంగా తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో కంభం సీఐ రాజేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రశాంతంగా ఎస్సై పరీక్షలు

- ప్రిలిమ్స్ పరీక్షకు హాజరైన 6,998 మంది అభ్యర్థులు
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ మలికా గర్గ్
- ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిన పలువురు అభ్యర్థులు

ఒంగోలు టౌన్:

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఎస్సై ఉద్యోగాలకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో 2 సెంటర్లు, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలోని 3 సెంటర్లు, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలోని 3 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అత్యధిక శాతం అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 గంటల నుంచే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదనే నిబంధనను అమలు చేయడంతో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు వెనుదిరగాల్సి వచ్చింది. చివరి నిమిషంలో వచ్చిన మరికొందరు అభ్యర్థులు పెన్నులు కూడా వెంట తెచ్చుకోకపోవడం గమనార్హం. పరీక్ష కేంద్రాల బయట కనిపించిన వారిని పెన్నులు అడిగి తీసుకోవడం కనిపించింది. టంగుటూరు మండలానికి చెందిన ఓ అభ్యర్థి అరగంట ఆలస్యంగా రావడమే కాకుండా ప్రధాన గేటు వద్ద పోలీసులు ఉండటంతో దానికి పక్కనే ఉన్న మరో గేటు ద్వారా లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి వెనక్కు పంపించారు.

#### తగ్గిన హాజరు శాతం

ఎస్సై రాత పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారికంటే తక్కువగా అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 8,039 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆదివారం నిర్వహించిన పరీక్షలకు సమారు వెయ్యి మందికి పైగా అభ్యర్థులు గైర్హాజరయ్యారు.


క్విస్ కాలేజీ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

పేపర్–1కు 6998 మంది అభ్యర్థులు హాజరుకాగా పేపర్–2ను 6,991 మంది రాశారు.

#### భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ, పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఎస్పీ మలికా గర్గ్ స్వయంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పరీక్షలు పూర్తయ్యాక జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూంకు తీసుకెళ్లే వరకు బందోబస్తు కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, సీఐ రంగనాథ్ తదితరులు ఉన్నారు.


రైజ్ కాలేజీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మలికా గర్గ్, పక్కన ఏఎస్పీ నాగేశ్వరరావు


క్విస్ కాలేజీ పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది


క్విస్ కాలేజీ సెంటర్‌లో ట్రాన్స్‌జెండర్ అభ్యర్థి హాల్ టికెట్ పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది


అభ్యర్థుల సెల్‌ఫోన్లు భద్రపరుస్తున్న సిబ్బంది


భోజనం చేస్తున్న అభ్యర్థులు


మెడికల్ క్యాంప్‌లో మాస్కులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

# సంతోషాలు మింగిన మృత్యువు

- మేదరమెట్ల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం
- నలుగురు గుంటూరు తుఫాన్‌నగర్ వాసులు
- ఎస్‌ఐ కుటుంబంలో పెను విషాదం
- భార్య, కుమార్తె మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరైన ఎస్‌ఐ సముందర్‌వలి
- కారు టైర్ పంచర్ కావడంతో చోటుచేసుకున్న ప్రమాదం
- మృతదేహాలు గుంటూరు తరలింపు
- డ్రైవర్ వీరబ్రహ్మాచారి మృతదేహాన్ని అద్దంకి తరలింపు


షేక్ వహిదావలి, ఆయేషా హుమేరావలి మృతదేహాల వద్ద విషణ్ణ వదనాలతో కుటుంబ సభ్యులు, స్థానికులు

లక్ష్మీపురం(గుంటూరు): ఆ కుటుంబాల మధ్య స్నేహంపై విధికి కన్నుకుట్టింది. ఇరుగు పొరుగున ఉంటూ చిగురించిన స్నేహం చివరకు మృత్యువులోనూ తోడుగా సాగింది. ప్రకాశం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. మహాశివరాత్రి సందర్భంగా కారులో చిన్నగంజాం తిరునాళ్లకు వెళ్లి అక్కడ నుంచి అద్దంకి బయలుదేరగా, కొరిశపాడు మండలం మేదరమెట్ల భ్రమర వెంచర్ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో పెనువిషాదం నింపింది. కారు టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని వాహనం అవతల రోడ్డు వైపునకు వెళ్లింది. అదే సమయంలో విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న కంటైనర్ లారీ కారును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు నలుగురు అక్కడికక్కడే మృత్యుఒడికి చేరిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిలో నలుగురు గుంటూరు నగరంలోని మారుతీనగర్ ఆర్చి సెంటర్ పరిధిలో ఉన్న తుఫాన్ నగర్ యాగంటి అపార్ట్‌మెంట్స్ వాసులు. డ్రైవర్ అద్దంకికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతులు గుంటూరుకు చెందిన మెహముదా, ఇమాంసా కుమార్తె షేక్ వహిదావలి (38), ఆమె కుమార్తె షేక్ ఆయేషా హుమేరావలి (9), అదే ప్రాంతానికి చెందిన గుర్రాల జయశ్రీ (50), ఆమె కుమార్తె గుర్రాల దివ్యతేజ (29), అద్దంకి టౌన్‌కు చెందిన డ్రైవర్ కోవెలమూడి వీరబ్రహ్మాచారి (22)గా పోలీసులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం గుంటూరుకు చెందిన నలుగురిని ఆదివారం వారి నివాసాలకు తరలించారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

#### వహిదా చిన్నతనం నుంచి నా బిడ్డలా ఉండేది

నా పేరు శివాజీ. నేను అథ్లెటిక్స్ కోచ్‌ను. నా వద్దకు మృతురాలు షేక్ వహిదా 6వ తరగతి నుంచి క్రీడా శిక్షణకు వచ్చేవారు. వహిదాకు ఇద్దరు చెల్లెళ్లు. తండ్రి డ్రైవర్‌గా దుబాయ్ వెళ్లిన సమయంలో వహిదా ఇద్దరు చెల్లెళ్లు, తల్లిని చూసుకుంటూ, ఇటు క్రీడా శిక్షణ పొందుతూ కుటుంబ బాధ్యతను నడిపించేది. నా వద్ద వహిదా డిస్కస్‌త్రో శిక్షణ పొంది రాష్ట్ర స్థాయిలో అనేక పోటీల్లో బంగారు పతకాలను పొందింది. జాతీయ క్రీడా పోటీల్లో సైతం సత్తా చాటింది. ఎంతో మర్యాదగా, పద్ధతిగా ఉండే వహిదా సముందర్‌వలిని ప్రేమించి వివాహం చేసుకుంది. ఇరు కుటుంబాలు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని ప్రస్తుతం ఒక మంచి స్థానంలో ఉన్నామనే నమ్మకం వారిలో ఏర్పడుతున్న సమయంలో ఇంతటి ఘోరం జరగడం నా మనసును కలచివేసింది. నా చేతిలో పెరిగిన బిడ్డను కోల్పోయినంత బాధను అనుభవిస్తున్నాను. పసిబిడ్డ సైతం ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరం.


గుర్రాల జయశ్రీ


గుర్రాల దివ్యతేజ


తల్లి, కుమార్తెలు షేక్ వహిదావలి, షేక్ ఆయేషా హుమేరావలి

#### కన్నీటిపర్యంతమైన సన్నిహితులు..

మృతురాలు వహిదా, కుమార్తె ఆయేషా హుమేరా వలి, జయశ్రీ, దివ్యతేజ మృతదేహాలను చూసిన స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. ఎలాంటి శుభకార్యం జరిగినా, పండుగలు జరుపుకున్నా కలిసి ఉండే ఈ కుటుంబాలు చివరి క్షణంలో కూడా కలిసే అనంతలోకాలకు చేరడంపై చలించిపోయారు. కులాలు, మతాలు వేరైనా ఒకే ప్రాంతంలో ఉంటూ ఒక తల్లీబిడ్డలుగా కలిసి ఉండే ఈ నలుగురు రోడ్డు ప్రమాదంలో కలిసి తుదిశ్వాస విడవడంపై స్థానికులు శోక సంద్రంలో మునిగిపోయారు.

#### చేతికి అందివచ్చిన కొడుకు మృతితో..

కారు డ్రైవర్ కొండమూడి బ్రహ్మాచారి (22) స్వగ్రామం అద్దంకి మండలంలోని ఉప్పలపాడు. తండ్రి వెంకట్రావు, తల్లి పార్వతి. తండ్రి వెంకట్రావు లైటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నాడు. ఈ క్రమంలో ఎస్‌ఐ కుటుంబాన్ని చినగంజాంలోని తిరునాళ్లకు తీసుకువెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కారు ప్రమాదంలో మృత్యువాతపడటంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. చేతికి అందివచ్చిన కొడుకు తిరిగిరానిలోకాలకు చేరడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇటీవలే బ్రహ్మాచారికి వివాహం చేయడానికి ఒక సంబంధాన్ని చూసినట్లు బంధువులు చెబుతున్నారు.

#### నేను ఎవరికోసం బతకాలి..

నేను ఇక ఎవరి కోసం బతకాలి.. నాకు ఇక ఎవరు ఉన్నారు.. అంటూ భార్య, కుమార్తె మృతదేహాలను చూసి ఎస్‌ఐ సముందర్‌వలి గుండెలవిసేలా రోధించారు. అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ సముందర్‌వలి భార్య షేక్ వహిదావలి, కుమార్తె షేక్ ఆయేషా హుమేరావలితో ఎంతో ప్రేమగా ఉండేవారు. ఎస్‌ఐ సముందర్‌వలి మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరు అవ్వడం స్థానికుల హృదయాలను కలచివేసింది. మృతురాలు షేక్ వహిదా తల్లి మెహముదా క్యాన్సర్‌తో 6 నెలల క్రితం మృతి చెందారు. మృతురాలు వహిదా చిన్నతనం నుంచి క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు కైవసం చేసుకున్నారు. ఆ క్రమంలో పరిచయమైన షేక్ సముందర్‌వలిని ప్రేమించి వివాహం చేసుకుంది. వీరి కుటుంబంతో ఎంతో ప్రేమగా, సొంత కుటుంబ సభ్యులుగా ఉండే మృతురాలు గుర్రాల జయశ్రీ, ఆమె కుమార్తె గుర్రాల దివ్యతేజ ఈ ప్రమాదంలో మృతి చెందడం రెండు కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది.



# వివాహిత అనుమానాస్పద మృతి

- గుట్టుచప్పుడు కాకుండా మృతదేహం తరలింపు
- అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదు
- కేసు దర్యాప్తు చేస్తున్న వేదాయపాళెం పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. భర్త మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా స్వగ్రామానికి తీసుకెళ్లాడు. అయితే బాధిత తండ్రి కుమార్తె మృతిపై అనుమానం ఉందని, మృతదేహాన్ని జీజీహెచ్‌కు తీసుకొచ్చి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారు శుక్రవారం వివరాలు వెల్లడించారు.. ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం రామలింగాపురానికి చెందిన శ్రీనివాసులుకు నలుగురు సంతానం. చిన్న కుమార్తె సరస్వతి (29)కి గుడ్లూరు మండలం చెంచురెడ్డిపాళేనికి చెందిన బి.మాలకొండారెడ్డితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి రిత్విక్, ధనుశ్రీ, నిశాంత్ అనే సంతానం ఉన్నారు. మాలకొండారెడ్డి బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడు నెలలుగా దంపతులిద్దరూ స్థానిక పడారుపల్లిలో నివాసముంటూ పనులు చేసుకుంటున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల నడుమ విభేదాలున్నాయి. సరస్వతి పుట్టింటికి వెళ్లగా తల్లిదండ్రులు సర్దిచెప్పి కాపురానికి పంపారు. ఈ నెల 18వ తేదీన మాలకొండారెడ్డి తన భార్య బంధువు బాలిరెడ్డికి ఫోన్ చేసి సరస్వతి ఆత్మహత్య చేసుకుందని తమ గ్రామానికి తీసుకెళ్తున్నామని చెప్పాడు. మృతురాలి తండ్రి శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు చెంచురెడ్డిపాళేనికి వెళ్లారు. కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

#### జీజీహెచ్‌కు తీసుకొచ్చి..

బాధిత తండ్రి శ్రీనివాసులు కుమార్తె మృతిపై అల్లుడు మాలకొండారెడ్డి వివరాలు అడిగాడు. 18వ తేదీ ఉదయం 9 గంటల ప్రాంతంలో కుమారుడు నిశాంత్ ఆరోగ్యం బాగోలేకపోవడంతో హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు చెప్పాడు. తిరిగి ఇంటికి రాగా లోపల గడియ పెట్టి ఉందని, సరస్వతిని ఎంత పిలిచినా స్పందన లేదు. వెనుకవైపు కిటికీలో నుంచి చూడగా చీరతో ఉరేసుకుంది. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తెరిచి ఆమెను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందిందని మాలకొండారెడ్డి తెలిపాడు. అంబులెన్స్ మాట్లాడుకుని ఊరికి తీసుకొచ్చినట్లు చెప్పాడు. అయితే ఈ విషయం నమ్మేలా లేదంటూ శ్రీనివాసులు స్థానిక పెద్దలతో మాట్లాడి కుమార్తె మృతదేహాన్ని నెల్లూరులోని జీజీహెచ్‌కు తీసుకొచ్చాడు. సరస్వతి మృతిపై అనుమానం ఉందని, మృతికి భర్తే కారణమని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పులిని చంపి వండుకుని తిన్నారు?

- వదంతులు అంటున్న ఫారెస్ట్ అధికారులు

యర్రగొండపాలెం: పులిని చంపి వండుకుని తిన్నారని అటవీ శాఖాధికారులకు సమాచారం అందింది. దీనిపై వెంటనే స్పందించిన అధికారులు విచారణ చేపట్టారు. పుల్లలచెరువు మండలంలోని అక్కచెరువు చెంచుగూడెంకు సమీపంలోని ఈతల కొండ, ఎర్రదరి ప్రాంతాల్లో దుప్పులు, మనపోతులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఆ ప్రాంతానికి చెందిన గిరిజనులు కొంతమంది విద్యుత్ తీగలుపెట్టి జంతువులను వేటాడుతుంటారని ఆరోపణలు ఉన్నాయి.

ఈ నెల 10వ తేదీన ఆ ప్రాంతంలో పులి సంచరిస్తోందని అటవీశాఖ అధికారులకు తెలిసింది. ఈ మేరకు ఆ ప్రాంతంలో పులి పాదముద్రలు కూడా ఫారెస్ట్ అధికారులు సేకరించారు. ఈ పులిని కరెంటు తీగలు పెట్టి చంపారని, తోలును అడవిలో ఉన్న బావిలో వేసి, మాంసాన్ని వండుకుని తిన్నారని యర్రగొండపాలెంలోని అటవీశాఖ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించారు. ఈ విషయాన్ని ఆ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ధ్రువీకరించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.



#### మూడు పులులు సంచరిస్తున్నాయి

పులిని చంపి దాని మాంసం వడుకుని తిన్నారని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎ.నీలకంఠేశ్వరరెడ్డి వివరణ ఇచ్చారు. తమకు అందిన సమాచారం మేరకు అక్కపాలెం ప్రాంతంలో విచారణ చేపట్టామని ఆయన తెలిపారు. పులి సంచరిస్తోందని తెలిసిన వెంటనే పాదముద్రలు సేకరించామని, తద్వారా అక్కడ రెండు ఆడ పులులు, ఒక మగపులి సంచరిస్తోందని తేలిందని ఆయన వివరించారు. అటవీ జంతువులు ఎక్కువగా సంచరిస్తున్న ఆ ప్రాంతంలో సహజంగానే పులులు తిరుగుతుంటాయన్నారు. అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నట్లు తమకు కూడా తెలిసిందని, దీనివల్ల పులులకు ప్రాణహాని ఉంటుందన్నారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి అటవీ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పులిని చంపినట్లు వస్తున్న వదంతులపై తమ దర్యాప్తు ఇంకా ముగియలేదని ఎఫ్ఆర్‌ఓ చెప్పారు.

# సత్తా చాటిన జేసీ అగ్రహారం ఎడ్లు

బేస్తవారిపేట: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని మోక్షగుండం ముక్కీశ్వర క్షేత్రంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించారు. బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగశంకర్ ఎడ్లు 2100 అడుగులతో మొదటిస్థానం, తెల్లపాడుకు చెందిన బద్దెపోగు జయన్న ఎడ్లు 1990 అడుగులతో ద్వితీయస్థానం, వైఎస్సార్ జిల్లా అనవారిపల్లెకు చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు 1969 అడుగులతో తృతీయస్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండు, మూడు బహుమతులుగా రూ.40 వేలు, రూ. 30 వేలు, రూ.20 వేలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.


ముక్కీశ్వరక్షేత్రంలో బండలాగుతున్న ఎడ్లు

# విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

అర్ధవీడు(కంభం): విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని బొల్లుపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన వీరెల్ల పోలయ్య(42) శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రికి ఇంటికి తిరిగి రాకపోతే ఎక్కడికైనా తిరునాళ్లకు వెళ్లాడేమోనని కుటుంబసభ్యులు భావించారు. ఆదివారం ఉదయంలో పొలానికి వెళ్లిన వారికి స్టాటర్ పెట్టె వద్ద పోలయ్య మృతి చెంది ఉండటాన్ని చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పొలానికి నీళ్ల పెట్టేందుకు వెళ్లిన పోలయ్య నిన్న సాయంత్రమే మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


పోలయ్య మృతదేహం